క్లుప్తంగా

గ్రామ కంఠం భూమిని కాపాడండి

నందిగామ: రోజు రోజుకూ కబ్జాకు గురవుతున్న గ్రామ కంఠం భూమిని కాపాడాలని మండలంలోని సర్సప్పగూడ గ్రామానికి చెందిన కాట్న సురేందర్ బుధవారం తహసీల్దారు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గ్రామానికి ఆనుకొని ఉన్న విలువైన గ్రామ కంఠం భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. భవిష్యత్తులో గ్రామ అవసరాల కోసం ఉపయోగించుకోవాల్సిన భూమిని ఆక్రమించడం తగదన్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామ కంఠం భూమిని కాపాడాలని విన్నవించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న ఎండీ షైమిద

కొత్తూరు: ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు రాజకీయ, ఆర్థిక రంగాల్లో తప్పకుండా రాణించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ షైమిద అన్నారు. కొత్తూరు మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. సమాజంలో ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ సమీకరణాలు, ప్రభుత్వాల పాలన, ప్రజల ఇబ్బందులు తదితర అంశాలపై మహిళలు తమ గళం విప్పాల్సిన అవసరం ఉందన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య మహిళలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎండీ షకీల్, నాయకులు కమల, బీబీ ఫాతీమా, అస్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బడుల దోపిడీని అరికట్టాలి

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్

మొయినాబాద్: ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ అన్నారు. పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని బుధవారం మొయినాబాద్ మండల విద్యాధికారి మల్లయ్యకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు, డొనేషన్ల పేరుతో రూ.లక్షలు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన మౌలిక సదుపాయాలు కల్పించకుండా పేద విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారడానికి విద్యాశాఖ అధికారులే కారణమవుతున్నారన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో హోమం


చౌడమ్మగుట్ట దేవాలయంలో గో పూజ చేస్తున్న భక్తులు

షాద్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం అమావాస్యను పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రఘుపతి రావు, రాఘవేంద్రచారి, కృష్ణ, ప్రమోద్ భక్తులచే హోమం, గోమాతకు ప్రత్యేక పూజ కార్యక్రమాలను చేపట్టారు. గోవులను పూజించడం మన సాంప్రదాయమని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ లతాశ్రీశ్రీశైలంగౌడ్, మాజీ సర్పంచ్ శ్రీశైలంగౌడ్, మాజీ వార్డు సభ్యుడు లక్ష్మయ్య, నాయకులు కృష్ణయ్య, శిరీష, యాదగిరి, అశ్విని, భజన భక్తబృందం సభ్యులు, వాసవి క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


సదస్సును ప్రారంభిస్తున్న జయశంకర్ కృష్ణమూర్తి

మొయినాబాద్‌రూరల్: భారతీయ తత్వశాస్త్రాన్ని ఆధునిక జీవితానికి అనువదించి నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ప్రసిద్ధ ప్రేరణాత్మిక ఆచార్యుడు జయశంకర్ కృష్ణమూర్తి అన్నారు. ఎన్కేపల్లి పరిధిలోని అమ్డాపూర్ చౌరస్తాలో గల జేబీఆర్ విద్యా సంస్థలలో వేదాంత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ది ఇన్నర్ ఎడ్జ్ లైఫ్ లీడర్ షిప్ లార్జింగ్ ఇన్‌ఫ్రాక్ట్ అనే అంశంపై జేబీఆర్ హార్టికల్చర్ కళాశాలలో సమావేశాన్ని నిర్వహించారు.

హద్దురాళ్ల పంచాయితీ

- సర్వేయర్ లేక.. సమస్యలు తీరక
- నెలలుగా పెండింగ్‌లోనే భూ కొలతలు
- రోజు రోజుకూ పెరుగుతున్న భూ వివాదాలు


కేశంపేట తహసీల్దార్ కార్యాలయం

కేశంపేట: గ్రామాల్లో భూముల క్రయవిక్రయాల సమయంలో పట్టాదారు భూమి కొలతను చేసి కొనుగోలు చేసిన వ్యక్తికి అప్పగించి, రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాల్సి ఉంటుంది. తాతల కాలం నుంచి వారసత్వంగా వస్తున్న భూమికి హద్దులు లేకపోవడంతో సంబంధిత రైతులు సామరస్యంగా కొలతలను నిర్ధారించేకునేందుకు మండలంలో సర్వేయర్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పెండింగ్‌లోనే దరఖాస్తులు

మండలంలో 20 రెవెన్యూ గ్రామాల పరిధిలో 29 గ్రామ పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో సుమారు 46 వేల ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయ భూములున్నాయి. మండలం హైదరాబాద్‌కు సమీపంలో ఉండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా జోరుగా సాగుతుంది. వేరే ప్రాంతాల వారు ఇక్కడ భూములను పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. వీరితో పాటుగా వారసత్వంగా వచ్చిన భూములకు హద్దులు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ సర్వేయర్‌తో భూమిని సర్వే చేసుకొని హద్దురాళ్లను పెట్టుకోవడానికి రైతులు ఇష్టపడుతుంటారు. కానీ మండలంలో రైతులు తమ భూముల కొలతలను చేయించుకునేందుకు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులను చేసుకుంటున్నారు. కొన్ని నెలలుగా ఇలా చేసిన అర్జీలు పెండింగ్‌లోనే ఉంటున్నాయి.


గతంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

సర్వేయర్ రాక ఇబ్బందులు

గతంలో మండలంలో సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తు మరో మూడు మండలాలకు ఇన్‌చార్జిగా ఉండేవారు. దీంతో ఆయన పూర్తిస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండకపోవడం వల్ల ఇబ్బందులు పడ్డారు. మండలానికి ఇటీవల ప్రభుత్వం సర్వేయర్‌ను మే నెలలో నియమించింది. కొత్తగా వచ్చిన సర్వేయర్ విధుల్లో చేరిన రెగ్యులర్‌గా రాకపోవడంతో కొలతల సమస్యలు మళ్లీ మొదటికి వచ్చాయి. చాలా గ్రామాల్లో భూముల హద్దుల విషయంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఇలాంటి ఫిర్యాదులు అందుతున్నాయి.

అందుబాటులో ఉండాలి



ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడంతో మండలానికి రెగ్యులర్ సర్వేయర్‌ను నియమించారు. బదిలీపై వచ్చిన ఆయన మండల రైతులకు అందుబాటులో ఉండాలి. సర్వేయర్‌కు ఎలాంటి ఇన్‌చార్జి ఇవ్వొద్దు. భూములు ఎక్కువ మొత్తంలో ఉన్నాయి. సర్వేయర్ లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– నర్సింహయాదవ్, మాజీ వైస్ ఎంపీపీ, కేశంపేట

విధుల్లో చేరాడు



మండలానికి బదిలీ పైన వచ్చిన సర్వేయర్, మే చివరి వారంలో విధుల్లో చేరిన వెంటనే శిక్షణ కార్యక్రమానికి వెళ్లాడు. రెవెన్యూ సదస్సులు ఉండటంతో కార్యాలయంలో సిబ్బంది సైతం అందుబాటులో లేదు. ఇప్పటినుంచి సర్వేయర్ రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తాడు.

– అజాంఅలీ, తహసీల్దార్, కేశంపేట

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే కాలె యాదయ్య


శంకర్‌పల్లి: లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి: నిరుపేదల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శంకర్‌పల్లి ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాల్లోని ఆడపిల్లలకు ప్రభుత్వం అండగా నిలబడుతుందన్నారు. నిరంతరం ప్రజల కోసం ప్రజాపాలన ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. రైతు భరోసా నిధులను విడుదల చేసి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకయ్యగౌడ్, తహసీల్దార్ సురేందర్, నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, వెంకట్‌రాంరెడ్డి, మైపాల్, వెంకట్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల పరిశీలన

చేవెళ్ల: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు నాణ్యమైన విద్యను అందించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటి అంతస్తులో జరుగుతున్న అదనపు గదుల నిర్మాణం పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కళాశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. విద్యార్థుల సంఖ్య, అధ్యాపకుల వివరాలను ప్రిన్సిపాల్ కాంచనలతను అడిగి తెలుసుకున్నారు.

ఎమర్జెన్సీలో రాజ్యాంగ హననం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య


సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: దివంగత ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తయ్యాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో బుధవారం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేష్‌గుప్తా ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ సమయంలో జైలుకు వెళ్లిన సీనియర్ సిటిజన్స్‌కు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో బాబయ్య మాట్లాడుతూ.. ఆనాడు అధికార దాహంతో ఇందిరాగాంధీ రాజ్యాంగాన్ని హత్య చేశారని విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని అణచివేశారన్నారు. జేపీ, అద్వానీ, వాజ్‌పేయి, నానాజీదేశ్‌ముఖ్ వంటి నాయకుల పోరాటంతోనే మళ్లీ ప్రజాస్వామ్య బాటలోకి వచ్చిందన్నారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమర్జెన్సీని విధించి దేశాన్ని చీకట్లోకి నెట్టిన కాంగ్రెస్ పార్టీ ప్రజల గుండెల్లో మాయని మచ్చలా మిగిలిందన్నారు. అప్పట్లో జైలుకు వెళ్లిన కృష్ణారెడ్డి, బాల్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, వీరాంజనేయులుగౌడ్, మహ్మద్ జామీతో పాటుగా పాత్రికేయులను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి, నాయకులు విజయ్‌కుమార్, అశోక్‌గౌడ్, భూపాలాచారి, మనోహర్‌రెడ్డి, వెంకటేష్(దేశ్‌ముఖ్), వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు కార్మికుల ధర్నా


పరిశ్రమ ఎదుట ధర్నా చేపట్టిన కార్మికులు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్జర్ల శివారులో ఉన్న వెంకటేశ్వర హాచరీస్ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులు తమ డిమాండ్లను నెరవేర్చాలని ధర్నాకు దిగారు. పరిశ్రమ ఎదుట కార్మికులు చేపట్టిన ధర్నా బుధవారం 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. హాచరీస్‌లో పని చేస్తున్న కార్మికులకు దక్కాల్సిన హక్కులను యాజమాన్యం కాలరాస్తుందని ఆరోపించారు. తమ హక్కులకోసం శాంతియుతంగా 9 రోజులుగా ధర్నా చేస్తున్నా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు ప్రతి సంవత్సరం కనీసం 300 సర్వీస్ బెనిఫిట్స్ పెంచాలని, 25శాతం ఇంక్రిమెంట్ అమలులోకి రావాలని, ఐదు సంవత్సరాలకు ఒకసారి గ్రేడ్ చేంజ్ కావాలని అన్నారు. సీనియారిటీ ఉన్నా తమకు దక్కాల్సిన హక్కులు దక్కడంలేదని వాపోయారు.

బీసీల ఐక్యతకు కృషి


నియామక పత్రాన్ని అందజేస్తున్న జలజ తదితరులు

షాద్‌నగర్‌రూరల్: పాలకుల నిర్లక్ష్య వైఖరితోనే బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి పోతున్నారని జాతీయ బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు జక్కుల జలజ అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జలజ మాట్లాడుతూ.. బీసీ కులాల ఓట్లతో గెలిచిన అగ్రకుల నాయకులు అధికారాన్ని అనుభవిస్తున్నారన్నారు. ఆర్థిక అసమానతలు ఉండటంతోనే బీసీలు ఎదగలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ కులాలను ఒక చోటకు చేర్చడానికి బీసీసేన ప్రయతిస్తుందని, అందులో భాగంగానే కమిటీలు వేస్తున్నామన్నారు. అనంతరం బీసీసేన దూసకల్ గ్రామ మహిళా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా చంద్రకళ, ఉపాధ్యక్షురాలిగా శశికళగౌడ్, ప్రధానకార్యదర్శిగా జ్యోతి, కార్యదర్శిగా వినోద, సహాయ కార్యదర్శిగా వరలక్ష్మి, కోశాధికారిగా సంధ్య, ప్రచార కార్యదర్శిగా లక్ష్మమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

కాంగ్రెస్ పార్టీ జిల్లా మత్స్యకార చైర్మన్ మహేందర్‌ముదిరాజ్



మొయినాబాద్‌రూరల్: పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా మత్స్యకార చైర్మన్ నారాయణపురం మహేందర్‌ముదిరాజ్ అన్నారు. బుధవారం హిమాయత్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. రైతు సంబరాలు జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులందరికీ రైతు భరోసా నిధులు జమ కావడంతో పెట్టుబడికి ఉపయోగపడుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు నాణ్యతతో నిర్మించుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అన్నారు.

కుంగ్ ఫూ మాస్టర్‌కు అవార్డు


మాస్టర్ అహ్మద్‌ఖాన్‌ను సత్కరిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

షాద్‌నగర్: హైదరాబాద్‌లోని ఏఎస్‌రావునగర్ కమ్యూనిటీ హాల్ ఈసీఐఎల్ పార్కులో బుధవారం వరల్డ్ చారిటీ వెల్ఫేర్ ఫౌండేషన్ అవార్డ్స్‌లో పట్టణానికి చెందిన న్యూ పవర్ కుంగ్ ఫూ అకాడమీ మాస్టర్ అహ్మద్‌ఖాన్ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాస్టర్ అహ్మద్‌ఖాన్‌ను బెస్ట్ కోచ్‌గా ఎంపిక చేశారు. అనంతరం అవార్డును అందజేసి సత్కరించారు.

అక్షరాస్యత పెంచడమే 'ఉల్లాస్' లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఆమనగల్లు: అక్షరాస్యత శాతం పెంచడమే కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'ఉల్లాస్' పథకం లక్ష్యమని ఎంపీడీఓ కుసుమమాధురి అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉల్లాస్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఐకేపీలో పనిచేస్తున్న సీసీలు, పొదుపు సంఘాల మహిళలు ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలని సూచించారు. 15 సంవత్సరాలు నిండిన నిరక్షరాస్యులను గుర్తించాలని చెప్పారు. పదిమంది నిరక్షరాస్యులకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి, అక్షరాస్యులుగా తీర్చిదిద్దుమాని పేర్కొన్నారు. సర్వేను పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. అనంతరం నిరక్ష్యరాస్యుల అక్షరాస్యత కార్యక్రమం, ఉల్లాస్ యాప్ గురించి శిక్షకురాలు సంతోష వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ పాండు, ప్రదానోపాధ్యాయురాలు రామలక్ష్మి, ఐకేపీ ఏపీఎం దేవి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం


బాధితుడికి చెక్కును అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన సోమరాజు శేఖర్ ఆరోగ్య సమస్యలతో కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. వైద్య ఖర్చుల సాయం కోసం ఆయన.. నాయకుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డిని ఆశ్రయించగా.. ఆయన, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సహకారంతో సీఎం సహాయనిధి నుంచి రూ.60 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో బాధితుడి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోసురవి, పట్టణ అధ్యక్షుడు భానుకిరణ్, నాయకులు శ్రీకాంత్‌గౌడ్, ప్రవీణ్, రామకృష్ణ ఉన్నారు.

మాట నిలుపుకొన్న ప్రభుత్వం


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

యాచారం: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం అర్హుల బ్యాంకు ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమచేసిందని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అన్నారు. పథకం విజయవంతం అయిందని పేర్కొంటూ.. బుధవారం సంబురాలు నిర్వహించారు. అధికార పార్టీ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలి వద్ద అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు పూలమాలలేసి నివాళులు అర్పించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మాట ప్రకారం రైతులకు ఎకరాకు రూ.6 వేల చొప్పున ప్రభుత్వం.. వారి ఖాతాల్లో భరోసా నిధులు జమ చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వలన బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు ప్రజల్లో విశ్వాసం లేకుండా పోయిందన్నారు.

రాణాను తరలించొద్దు


తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోనే పోలీస్‌స్టేషన్ ఉంచాలని జాతీయ బీసీ సేన మండలాధ్యక్షురాలు ప్యాట జయ డిమాండ్ చేశారు. బుధవారం జాతీయ బీసీ సేన ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల కేంద్రంలో పీఎస్ ఉంటేనే అందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. మరో చోటికి తరలించడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, చెన్నయ్య, సంధ్య, అనిత, కమలమ్మ, లక్ష్మమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లపై ఫిర్యాదు

షాబాద్: సర్దార్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌లోని తైబజార్‌లో అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి విజయసింహకు ఫిర్యాదు చేశారు. బుధవారం తైబజార్‌లో నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వేలం కంటే అధికంగా డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. అవినీతికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, రైతులు డిమాండ్ చేశారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండలంలోని అబ్దుల్లాపూర్ మెట్, కవాడిపల్లి, బండరావిరాల, చిన్న రావిరాల, బాటసింగారం, జాఫర్‌గూడ, ఇనాంగూడ, లష్కర్‌గూడ గ్రామాల్లో రూ.1.43 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు.. చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించి, స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బుర్ర రేఖా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దాసుగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బడులపై చర్యలు తీసుకోండి

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

చేవెళ్ల: ప్రైవేట్ పాఠశాలల్లో అనుమతులు లేకుండా కొనసాగుతున్న యూనిఫాం, పుస్తకాల వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పలు ప్రైవేట్ పాఠశాలలను వారు బుధవారం పరిశీలించారు. అందులో ఓ పాఠశాలలో అమ్ముతున్న యూనిఫామ్‌ల దుకాణాన్ని మూయించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి రాజేశ్ మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఎలాంటి అనుమతులు లేకుండా యూనిఫాంలు, పుస్తకాలను విక్రయించడం దారుణమన్నారు. విద్యను వ్యాపారం చేస్తున్న నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

ఎస్ఎఫ్ఐ డిమాండ్

మొయినాబాద్: బుక్స్, యూనిఫాంలు విక్రయిస్తూ వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్, కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్ అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా బుక్స్, యూనిఫాంలు విక్రయించడాన్ని బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరిశీలించారు. విద్యాశాఖ సిబ్బందిని పిలిచి సీజ్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో విచ్చలవిడిగా బుక్స్, యూనిఫాంలు అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రుల రక్తాన్ని పీలుస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కమర్షియల్ భవనాల్లో బాత్‌రూంలు సరిగాలేక, ఆట స్థలాలు లేకుండా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు రేశ్వంత్, చరణ్‌గౌడ్, ప్రదీప్, ప్రశాంత్, యశ్వంత్, సాయి, తేజ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు సుమయిర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తయారు చేసిన భోజనాన్ని పరిశీలించారు. అనంతరం సుమయిర్ మాట్లాడుతూ... ఏజెన్సీ నిర్వాహకులు ఎలాంటి మెనూ పాటించకుండానే ఇష్టానుసారంగా వారికి నచ్చిన వంటలను చేస్తున్నారని అన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్, ఆదిల్, ముస్తఫా, రెహమాన్, హర్ష, శివ, ఫర్హాన్ తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల: ఓ ప్రైవేట్ పాఠశాలలో యూనిఫాం దుకాణం వద్ద పీడీఎస్‌యూ నాయకులు



మొయినాబాద్: పాఠశాలలో విక్రయిస్తున్న బుక్స్, యూనిఫాంలను పరిశీలిస్తున్న నాయకులు


షాద్‌నగర్‌రూరల్: ఉర్దూ మీడియం పాఠశాలలో ఎస్ఎఫ్ఐ నాయకులు